పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

చొప్పదండి శివారులో ఈజీఎస్ కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

చొప్పదండి/కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 9: గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. చొప్పదండి మండలం రుక్మాపూర్, కొలిమికుంట గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని, సెగ్రిగేషన్ షెడ్డ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. అనంతరం కొలిమికుంటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడారు. కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. చొప్పదండి శివారులోని కెనాల్‌లో ఉపాధి పనులను పరిశీలించారు. అలాగే, కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలోని నర్సరీతో పాటు సెగ్రిగేషన్ షెడ్డులో తయారు చేస్తున్న ఎరువును పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్డీవో శ్రీలత, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవోలు స్వరూప, దివ్య దర్శన్‌రావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ పరిశీలన

కలెక్టరేట్, ఫిబ్రవరి 9: జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోడౌన్‌లో కొనసాగుతున్న ఓటరు యంత్రాల మొదటి స్థాయి తనిఖీ ప్రక్రియను కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆయా పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, కళ్యాడపు ఆగయ్య, గాలి అనిల్‌కుమార్, బర్కత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 9: పెద్దపాపయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి బండ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశాడు. పంచాయతీ కార్యదర్శి బండ ప్రసాద్ విధులను విస్మరించి, గ్రామస్తులతో అసభ్యంగా ప్రవర్తించడం, ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్‌రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన పొల్దాసరి రమేశ్ (38) శుక్రవారం బాత్‌రూమ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 9: దుర్శేడ్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 220 మందికి వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. తాజా మాజీ సర్పంచ్ వెంకటమ్మ, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, కార్యదర్శి సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 9: రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి కళాశాలలో శుక్రవారం శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వంద మందికి పైగా అధ్యాపకులు, సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు. కళాశాల చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వైద్యురాలు వేదిక , కోఆర్డినేటర్ హర్షవర్ధన్ , కౌన్సిలర్లు భూలక్ష్మి, నవీన్, కళాశాల సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్‌రెడ్డి, వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాయకుడికి పరామర్శ

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 9: సీపీఐ మాజీ జిల్లా నాయకుడు బుర్ర కొండయ్య అనారోగ్యంతో బాధపడుతూ బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కాగా, శుక్రవారం ఆయనను పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పరామర్శించారు.

విద్యార్థులకు అభినందన

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 9: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు వేద్ లహోటి, ఆద్యాప్రదాయిని, సరయు, ఆద్యా, వశిష్ట్, శ్రీహాస్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ గౌతం తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్ అభినందించారు.

రేపు అవగాహన సదస్సు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 9: నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విష్ణు ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు పోటీ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అకాడమీ ఆపరేషన్స్ మేనేజర్ శ్రీతమ్ రెడ్డి తెలిపారు. నగరంలోని ప్రెస్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు నూతనకంటి వెంకట్, ప్రసన్న హరికృష్ణ, విష్ణువర్ధన్, నవీన్‌కుమార్ హాజరై పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

TEACHERS WANTED
KRISHNAVENI TALENT SCHOOLS
VEMULAWADA
Applications are invited for the following positions
- Principals for (Pre-Primary, Primary and High School)
- Trained graduate teachers for All subjects: NUR to 10th
- PET/SUPERVISORS
- Interview date: 11-02-2024 (Sunday) 9.30 am to 1.30 pm
Contact No: 90598 19019 / 90590 92677

రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 9: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ఆరోపించారు. కేరళ రాష్ట్ర పాలనలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ నగరంలోని తెలంగాణచౌక్‌లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. నాయకులు సత్యం, ముకుందరెడ్డి, తిరుపతి, అజ య్, రాజు పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసే కుట్ర

- రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తామని సీఎం మాట్లాడడం సరికాదు
- అలా చేస్తే ఊరుకునేది లేదు
- పాలన చేతగాక రోజుకో రాగం అందుకుంటున్న ముఖ్యమంత్రి
- మూడు సింహాల బొమ్మతో ఉన్న భారత ప్రభుత్వ చిహ్నం కూడా రాచరిక పాలనకు సంకేతమా?
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

కరీంనగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

కార్పొరేషన్, ఫిబ్రవరి 9: తెలంగాణ చిహ్నంలో మార్పులు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరికాదని, తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మండిపడ్డారు. శుక్రవారం రాత్రి కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ చిహ్నంలో 800 ఏండ్ల చరిత్ర కలిగిన కాకతీయ తోరణం, చార్మినార్ చిహ్నాలు ఉన్నాయన్నారు. అయితే, కేబినెట్‌లో తీర్మానం చేసి ఈ చిహ్నం తొలగిస్తామని, రాచరిక పోకడలకు సూచిక లెక్క ఉందని మాట్లాడడం పద్ధతి కాదన్నారు. తెలంగాణ ఏర్పాటైతే రాష్ట్రాన్ని పాలించడం చేతకాదని సీమాంధ్ర నేతలు అవహేళన చేసినప్పటికీ 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఏర్పాటైన రాష్ట్రంలో పదేళ్ల పాటు ఉద్యమనేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అశోక చక్రం ఉన్న మూడు సింహాలతో భారత ప్రభుత్వ చిహ్నం రూపొందించారని, మరి ఇది రాచరిక పాలనకు సంకేతమా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికీ సీమాంధ్ర పాలకుల మైకంలోనే ఉన్నారనే అర్థం అవుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేస్తామని కూడా మాట్లాడడం దేనికి సంకేతమని నిలదీశారు. పేర్లు మార్చడం కాదు.. ప్రజలకు ఏం చేయబోతున్నారో చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, గంగాధర ఎంపీపీ శ్రీరాం మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజుయాదవ్, ద్యావ మధుసూదన్‌రెడ్డి, బద్దం ప్రవీణ్ రెడ్డి, శ్రావణ్, ఓంకార్ పాల్గొన్నారు.

వైభవోపేతంగా కలశాభిషేకం

వీణవంక, ఫిబ్రవరి 9: మయూరగిరి పీఠాధిపతులు నమిలికొండ రమణాచార్యస్వామి, ఆలయ అధ్యక్షుడు సత్యనారాయ ణ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవ కార్యక్రమాలు శుక్రవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మామిడాలపల్లిలో పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా 64 రకాల దివ్య ఔషధాలు, ఏడు నదుల జలాలు, పంచామృతాలు, పంచసూక్తాలు, పంచ ఉపనిషత్తులు, 10008 కలశాలతో వేంకటేశ్వరస్వామికి అత్యంత వైభవంగా అభిషేకం నిర్వహించారు.

10008, ఏడు నదుల పంచామృత కలశాలతో పూజలు చేస్తున్న అర్చకులు

ప్రారంభమైన శైశిర నవరాత్రోత్సవాలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 9: నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో శుక్రవారం శైశిర నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. దుర్గాభవానీ అమ్మవారికి వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఫల పంచామృతాభిషేకం, మహా హారతి, విశేష పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణశర్మ, ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

మానకొండూర్, ఫిబ్రవరి 9: మానకొండూర్‌లోని చాణక్య ఉన్నత పాఠశాలలో శుక్రవారం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి భూదయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ గోపాల్‌రెడ్డి, కరస్పాండెంట్ ఆడెపు రవీందర్, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

కలెక్టరేట్, ఫిబ్రవరి 9: తప్పిపోయిన బాలుడిని గుర్తించి బాలల సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. కోల్‌కతాకు చెందిన బాలుడు కిషన్‌కుమార్ హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి అమ్మమ్మతో కలిసి రాగా, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తప్పిపోయాడు. అక్కడి నుంచి రైలులో కరీంనగర్‌కు చేరుకుని, నగరంలోని మార్కెట్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు గమనించారు. బాలుడిని చేరదీసి వివరాలు అడుగగా, సక్రమంగా చెప్పకపోవడంతో బాలల సంక్షేమ కమిటీకి అప్పగించారు. బాలుడిని బుజ్జగించి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్న సీడబ్ల్యూసీ సభ్యులు వారికి సమాచారం ఇచ్చారు. సరైన ఆధారాలతో శుక్రవారం సీడబ్ల్యూసీ కార్యాలయానికి చేరుకున్న తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగశేఖర్, అర్చన, రాధ, విజయ్, సాయికిరణ్, ప్రియాంక, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: దుర్శేడ్‌లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న అధికారులు

అధికారుల శ్రమదానం

గంగాధర/కరీంనగర్ రూరల్/చిగురుమామిడి/తిమ్మాపూర్, ఫిబ్రవరి 9: గంగాధర, కరీంనగర్ రూరల్, చిగురుమామిడి, తిమ్మాపూర్ మండలాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవోలు మల్లోత్రా, నర్సయ్య, ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

వెన్నెపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

సైదాపూర్, ఫిబ్రవరి 9: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు హుందాగా స్వీకరించాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెన్నెపల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముత్యాల గాంధీ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టోర్నమెంట్ల నిర్వహణతో క్రీడాకారుల నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. ప్రతి క్రీడాకారుడు సత్తా చాటాలని కోరారు. నిర్వాహకుడు గాంధీయాదవ్‌ను ఆయన అభినందించారు. కాగా ఘనపూర్‌లో పార్టీ నాయకులు ఇటీవల గాయపడగా వారిని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, సింగిల్ విండో చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ తొంట ఓదెలు, మాజీ సర్పంచులు చంద శ్రీనివాస్, కాయిత రాములు, కొత్త రాజిరెడ్డి, నాయకులు వీరారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రజినీకాంత్, అశోక్, చంద్రయ్య, విద్వాన్ రెడ్డి, రవీందర్, స్వామి, కొంరయ్య, సర్దార్, రమేశ్ తదితరులు ఉన్నారు.

'దళితబంధు' విడుదల చేయాలి

వీణవంక, ఫిబ్రవరి 9: దళితబంధు రెండో విడుత నిధులు విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళితబంధు రెండో విడుత నిధులు పూర్తి స్థాయిలో మంజూరు కాలేదన్నారు. వెంటనే దళితబంధు నిధులు విడుదల చేయాలని, లేకుంటే నియోజకవర్గ వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, రాజు, పృథ్వీరాజ్, అనిల్, రవికిరణ్, వినయ్, రాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రచారం

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 9: ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలను పురస్కరించుకొని పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ పెద్దపాపయ్యపల్లిలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కలిగే దుష్పరిణామాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అలాగే శివాలయంలో గ్రామస్తులతో కలిసి ఏక బిల్వం మొక్కలను నాటాడు.

మరుగుదొడ్లను శుభ్రపరచాలి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 9: హుజూరాబాద్ బస్టాండ్‌లోని మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని, శుభ్రం చేయించాలని హెల్ప్ టీం సభ్యులు శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్‌కు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ప్రయాణికులు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు హర్షద్, మునావర్, షఫి, ఇర్ఫాన్, బాబా, ఫరూక్, ఎస్‌కే షఫి, రాఖీబ్, అబ్దుల్, సోహెల్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

గంగాధర, ఫిబ్రవరి 9: మండలంలోని ఒద్యారం గ్రామంలో వరి, మక్క చేలను శుక్రవారం ఏవో రాజు పరిశీలించారు. వరిలో జింక్ లోపం, మక్కలో కత్తెర పురుగును గమనించి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఆర్థిక సాయం అందజేత

గంగాధర, ఫిబ్రవరి 9: కొండన్నపల్లి గ్రామానికి చెందిన అంతగిరి రాజమల్లు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని శుక్రవారం మాజీ సర్పంచ్ రేండ్ల జమున-శ్రీనివాస్ పరామర్శించారు. రూ.3 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

భూఆక్రమణ కేసులో మరో ముగ్గురి అరెస్ట్

రాంనగర్, ఫిబ్రవరి 9: కొత్తపల్లి మండలం రేకుర్తిలోని భూమికి సంబంధించిన నకిలీ పత్రాలను చూపించి రూ. కోటి ముప్పై ఏడు లక్షలు వసూలు చేసి మోసగించిన 17వ డివిజన్ కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్, 18వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణాగౌడ్, ఏలేటి భరత్ రెడ్డిని అరెస్టు చేసినట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వేములవాడలోని శివసాయినగర్‌కు చెందిన గునుకుల రాజిరెడ్డికి 2014లో కమాన్‌పూర్‌కు చెందిన పంజాల శ్రీనివాస్ ద్వారా సుధగోని కృష్ణాగౌడ్‌తో పరిచయం ఏర్పడింది. కాగా, కృష్ణాగౌడ్ గునుకుల రాజిరెడ్డితో రేకుర్తి శివారులో సర్వేనంబర్ 119లో 25 గుంటల భూమి అమ్మకానికి ఉందని తెలిపాడు. రాజిరెడ్డి ఆ భూమి కొనుగోలు చేస్తానని చెప్పగా కృష్ణాగౌడ్, జక్కుల మల్లేశం కలిసి గుంటకు ఆరు లక్షల చొప్పున అగ్రిమెంట్ చేసుకోగా, రూ.31లక్షలు భయాన ఇచ్చారు. సదరు భూమికి హద్దులు ఏర్పాటు చేసేందుకు వెళ్లగా, ఇతరులు వచ్చి అడ్డుకున్నారని బాధితుడు రాజిరెడ్డి తెలిపాడు. విషయం కృష్ణాగౌడ్‌కు తెలుపగా ఆ భూమికి బదులు సర్వేనంబర్ 79/బీలో 20 గుంటల భూమి అమ్మకానికి కలదని, గుంటకు రూ. 9 లక్షల చొప్పున ఇప్పిస్తానని తెలిపారన్నారు. ఒప్పుకోగా 2016 జూలై 1న సేల్ అగ్రిమెంట్ డీడ్ చేసుకున్నామన్నారు. పలు వాయిదాల్లో రూ. 76 లక్షలు కృష్ణా గౌడ్‌కు చెల్లించి, భూమి రిజిస్ట్రేషన్ చేయించాలని కోరగా, కంకణాల భాగ్యలక్ష్మి, కంకణాల సుజాత పేరిట ఉన్న 700 చదరపు గజాలను, రాజిరెడ్డి తమ్ముడైన గునుకుల సంపత్‌కుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడని, మిగిలిన భూమి రిజిస్ట్రేషన్ చేయించమని కోరగా వడ్డేపల్లి కరుణాదేవి పేరిట ఉన్న 1210 చదరపు గజాల భూమిని తన సోదరుడైన గునుకుల సంపత్ కుమార్ పేరిట 2017 ఫిబ్రవరి 14న రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపాడు. రిజిస్ట్రేషన్ చేయించిన భూములకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు కృష్ణాగౌడ్‌ను అడుగగా గజ్జల స్వామి పేరిట 2006 జనవరి 2న జీపీఏ డాక్యుమెంట్ ఇవ్వగా, అది కూడా వివాదాల్లో ఉన్నట్లు తెలిసిందన్నారు. వాస్తవానికి హస్తపురం దుర్గయ్యకు 1991లో ప్రభుత్వం అసైన్డ్ భూమి ఇచ్చిందని, అందులో 2002లో 10 గుంటలు రేకుర్తికి చెందిన వడ్డేపల్లి కరుణాదేవి,10 గుంటలను వడ్డేపల్లి రాజయ్యకు విక్రయించినట్లు తెలిసిందన్నారు. ఇదిలా ఉండగా గునుకుల రాజిరెడ్డి 700 చదరపు గజాల భూమిని గజ్జల స్వామి పేరిట తిరిగి జీపీఏ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించాడని, అదే 700 చదరపు గజాలను గజ్జల స్వామి, భాగ్యలక్ష్మి, సుజాత పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపాడు. కాగా, కృష్ణాగౌడ్‌ను తన వద్ద తీసుకున్న డబ్బుకు భూమి రిజిస్ట్రేషన్ చేయించాలని పలుమార్లు కోరగా దాటవేశారన్నారు. ఇదిలా ఉండగా కృష్ణాగౌడ్ ఓ రోజు రాజిరెడ్డిని రేకుర్తిలోని తన ఆఫీసుకు పిలిపించి కోల ప్రశాంత్‌ను పరిచయం చేసి తన భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరిస్తాడని తెలిపాడన్నాడు. ఈ విషయమై ఇరువురు కలిసి భూమి సెటిల్‌మెంట్ అగ్రిమెంట్ తయారు చేసి తాను కొనుగోలు చేయాలనుకున్న భూమి బసవయ్య పేరిట ఉందని ఆ సమస్యను పరిష్కరించేందుకుగానూ రూ. 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, అడ్వాన్స్‌గా రూ. 20 లక్షలు ఇచ్చానని, మిగితా రూ. 30 లక్షలు సమస్యను పరిష్కరించిన తర్వాత ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపాడు. భూమి రిజిస్ట్రేషన్ చేయించాలని కోరగా రూ. 30 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు గురిచేసినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గునుకుల రాజిరెడ్డి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సుధగోని కృష్ణా గౌడ్, భరత్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. కోల ప్రశాంత్ హైదరాబాద్‌లో తల దాచుకున్నట్లు తెలిసి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిని కోర్టులో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

పీవీకి భారతరత్న ప్రకటించడం గర్వకారణం

- హర్షం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

హుజూరాబాద్‌టౌన్: సంబురాలు జరుపుకుంటున్న పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన జేఏసీ సభ్యులు

చొప్పదండి/హుజూరాబాద్ రూరల్/సైదాపూర్/హుజూరాబాద్ టౌన్/తెలంగాణచౌక్, ఫిబ్రవరి 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన ముద్దుబిడ్డ, బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూరాబాద్‌లో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేసి పటాకులు పేల్చారు. సంబురాల్లో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పీవీ హుజూరాబాద్ జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ భీమోజు సదానందం, జిల్లా అధికార ప్రతినిధి జెల్ల సుధాకర్, వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. మెట్పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ పూర్వ అధ్యక్షుడు పీవీ నరసింహారావును భారతరత్న పురస్కారానికి కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయడం అభినందనీయమని మెట్పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ మెంబర్ సెక్రటరీ ఇప్పనపల్లి సాంబయ్య హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అర్థిక సంస్కర్ణల పితామహుడు పీవీకి భారతరత్న ప్రకటించడం తెలంగాణకే గర్వకారణమని సర్పంచుల ఫోరం హుజూరాబాద్ మండల మాజీ అధ్యక్షుడు గూడూరి ప్రతాప్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, సైదాపూర్ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, వెన్నపంల్లి సింగిల్ విండో చైర్మన్ బిల్ల వెంకట్‌రెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, మండల ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, జాతీయ రైతు సంఘం నాయకుడు పొలాడి రామారావు హర్షం వ్యక్తం చేశారు.

సైదాపూర్: మాట్లాడుతున్న ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

పీవీకి భారతరత్న బీఆర్ఎస్ ఘనతే

కలెక్టరేట్, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ప్రకటించడం బీఆర్ఎస్ ఘనతేనని తెలంగాణ మైనార్టీస్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పీవీ శతజయంత్యుత్సవాలు నిర్వహించడంతో పాటు భారతరత్న పురస్కారానికి అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు.

కార్పొరేషన్, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయమని మేయర్ యాదగిరి సునీల్ రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నగరపాలక సంస్థ పాలకవర్గం తరపున మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

బాధిత కుటుంబాలకు పరామర్శ

గంగాధర, ఫిబ్రవరి 9: ఆచంపల్లి గ్రామ